ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ నూతన కమిటీని ప్రకటించారు. ఆర్ట్స్ కాలేజీలో జరిగిన 24వ ఓయూ మహాసభలలో నూతన అధ్యక్షుడిగా దాసరి రవి (పీహెచ్‌డీ) కార్యదర్శిగా రవినాయక్ (ఎంఏ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సాయికిరణ్, శ్రీకాంత్, అజయ్, సహాయ కారదర్శులుగా జి.క్రిష్ణ, నిహారిక, శ్రీధర్, శిరీష, ప్రశాంత్, కమిటీ సభ్యులుగా హుస్సేన్, శ్రీను, రాజ్ కుమార్, విజయ్, అశ్విని, సృజన, రాజు, సందీప్, పవన్ కళ్యాణ్‌తో పాటు 23 మందితో కమిటీని ప్రకటించారు.

డాక్టరేట్ ప్రదానం


విజేందర్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు సీమర్ల విజేందర్ రెడ్డి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అవార్డు అందుకున్నారు. పర్ఫామెన్స్ ఏవాల్యుయేషన్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ యూసింగ్ ఆప్టిమైజేషన్ మెథడ్ అనే అంశంపై ప్రొ.మనే మంజుల పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనలో సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేసి నెట్‌వర్క్‌కు సప్లయ్ చేసే క్రమంలో ఎదురయ్యే సమస్యలను ఆర్టిఫిషల్ ఇంటిలిజెంట్‌ని ఉపయోగించి పరిష్కారాలని తెలియజేసినట్లు తెలిపారు. పీహెచ్‌డీకి సహకరించిన యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, హెడ్ ప్రొ.విద్యాసాగర్ సహ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డబీల్‌పుర–మేడ్చల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్న సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.


సికింద్రాబాద్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్


పాన్‌బజార్ లోని పీహెచ్‌సీలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

చక్కని జీవితానికి చుక్కల మందు

సనత్‌నగర్: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరమని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్‌లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నాయకులు శ్రీహరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధనగర్: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం కార్పొరేటర్ కంది శైలజ పలు కేంద్రాలను సందర్శించి చుక్కల మందు వేశారు.

అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో..

అడ్డగుట్ట: చిన్నారుల నిండు జీవితం ఆరోగ్యకరంగా ఉండటానికి పోలియో చుక్కలు వేయించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ నెల 6వ తేదీ వరకు పోలియో చుక్కలు వేస్తారని, ఆదివారం అందుబాటులో లేని పిల్లలకు ఇంటింటికి తిరిగి వేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ జయశ్రీ, వైద్యాధికారి సాయి శంకర్, బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీను, మహ్మద్ రవి, మల్లేష్, రామస్వామి, గోపి, శివశంకర్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ పరిధిలో..

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో శనివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. సర్కిల్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అధికారులు పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ పార్టీల నేతలు, అధికారులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బొల్లారం రీడింగ్ రూమ్, రిసాల బజార్‌లలో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అరవింద్, రసూల్‌పురాలోని వివిధ బస్తీలు, ప్రభుత్వ పాఠశాల్లో మార్కెట్ మాజీ చైర్మన్ బీఆర్‌ఎస్ నేత టిఎన్. శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ కన్నన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

చుట్టలబస్తీలో..

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని చుట్టలబస్తీలో కార్పొరేటర్ చీర సుచిత్ర చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె పోలియో రహిత సమాజం కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి


పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చీర సుచిత్ర


సీసీ నగర్ బస్తీ దవాఖానాలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ హేమలత


బొల్లారంలో చిన్నారికి పోలియో చుక్కలను వేస్తున్న అరవింద్


రసూల్‌పురాలో చుక్కల మందు వేస్తున్న టీఎన్. శ్రీనివాస్


పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

నేడు మేరెడ్డి చంద్రారెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ దివంగత నేత మేరెడ్డి చంద్రారెడ్డి 27వ వర్ధంతి నేడు (4న) ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించనున్నట్లు విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ తేజ తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఈ–1 హాస్టల్‌లో నక్సలైట్ల చేతిలో హతమైన చంద్రారెడ్డిని స్మరించుకునేందుకు నేడు ఉదయం 10 గంట ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగే కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

5వ గ్యారంటీని అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులకు రూ.5 లక్షల కార్డును అందజేసే 5వ గ్యారంటీని అమలు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ పేర్కొన్నారు. మహిళలకు బస్సు ప్రయణం, ఉచిత గ్యాస్, కరెంట్ అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఉపయోగపడే ఎంతో కీలకమైన 5వ గ్యారంటీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

5 నుంచి దయానంద సరస్వతి జయంతి వేడుకలు

సికింద్రాబాద్: ఆర్యసమాజ వ్యవస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి వేడుకలు సీతాఫల్‌మండి ఆర్యసమాజంలో ఈ నెల 5, 6వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు డి.గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న సీతాఫల్‌మండి పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తామని అనంతరం యజ్ఞం, ధ్వజారోహణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అతిథులుగా యజ్ఞబ్రహ్మ ప్రద్యుమ్నశాస్త్రి, వేదమిత్ర, నిర్మలయోగభారతి, రావికంటి జ్యోతిశ్రీ హాజరవుతారని చెప్పారు. 6న విశ్రాంత ఓయూ తెలుగు ఆచార్యులు డాక్టర్ మసన చెన్నప్ప ప్రసంగం, సాహిత్య పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. 8న రుషిబోధోత్సవం, శివరాత్రి వేడుకలు నిర్వహిస్తామన్నారు. అనంతరం డాక్టర్ అరవిందశాస్త్రి, డాక్టర్ వసుధా శాస్త్రిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని గంగాధర్ తెలిపారు.

ప్రత్యేక జిల్లాకు సహకరించాలని వినతి


అనిల్‌కుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సికింద్రాబాద్: ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు ఆదివారం రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు సహకరించాలని అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ కోరారు. ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో సికింద్రాబాద్ నగరానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బాల్‌రాజ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శైలేందర్, సునీల్, కృష్ణయాదవ్, రవీంద్రసాగర్ ఉన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రసూల్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఎలక్ట్రో హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. జీఆర్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో అశ్రిత రెయిన్‌బో కమ్యూనిటి కేర్ లెర్నింగ్ సెయింట్ ఆధ్వర్యంలో శనివారం మడ్‌ఫోర్ట్ ఉత్తరయ్య హట్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాధర్ మాట్లాడుతూ.. పేదల సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుభాష్ బాబు, విజయ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, వెంకటేష్ కమరీందర్, ఈమామ్, శ్రీనివాస్‌రావు, రమేష్, పర్వతాలు, చందు, అనిత, ఝాన్సీ, కవిత పాల్గొన్నారు.

శ్రీసంత్ గురురవిదాస్ మహరాజ్ జయంతి


పూజా మహోత్సవంలో వల్లూరి నగేష్


సనత్‌నగర్: శ్రీసంత్ గురు రవిదాస్ మహరాజ్ 647 జయంతి పూజ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు హాజరై శ్రీసంత్ గురు రవిదాస్ మహరాజ్ అందించిన సేవలను కీర్తించారు. నేటితరం ఆయన చూపిన బాటలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీఎస్ నేత వల్లూరి నగేష్, వసంత్, అవినాష్, సంజు, శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా సువార్త స్వస్థత సభలు


క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న క్వయర్ గ్రూప్

లాలాపేట: బెత్లహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్ట్ చర్చి 17వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని శాంతినగర్‌లోని షీబాలత హైస్కూల్ మీటింగ్ హాల్లో మూడు రోజుల పాటు రక్షణ సువార్త స్వస్థత మహాసభలు ప్రారంభమయ్యాయి. ముఖ్య ప్రసంగీకులుగా చెన్నైకి చెందిన గుడ్ షపర్డు విడుదల సువార్త పరిచర్య నుంచి బ్రదర్ మిచెల్ డిమోర్ పాల్గొని యేసు క్రీస్తు సందేశాన్ని ప్రకటించారు. దేశం క్షేమం కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఈ సందర్భంగా చర్చి క్వయర్ బృందం ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. సంఘ కాపరి రెవరెండ్. ఆచార్య అహరోన్ తీగుళ్ల, ఏలిషమ్మ, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీ నిధులు విడుదల హర్షణీయం


మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

హిమాయత్‌నగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ బోర్డు టీపీటీ నిధులను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయడం హర్షణీయమని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న రూ. 48.50 కోట్ల నిధులను విడుదల చేశారని దీనికి కంటోన్మెంట్ బోర్డు తరపున ఆమె ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు టీపీటీ నిధులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా పెండింగ్‌లో ఉంచారన్నారు. ఈ నిధుల ద్వారా కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగులకు జీతాలు చెల్లించారన్నారు. ఎస్ఎన్‌డీపీ కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల నాలాలను తీసుకొచ్చి కంటోన్మెంట్ బోర్డులో వదిలేశారని, దీంతో కంటోన్మెంట్ నాలాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి సర్వీస్ టాక్స్ రూ.800 కోట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం విడుదల చేసిన 33 ఎకరాల భూమిని ఎలాంటి విలువ కట్టకుండా ప్రజలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు మర్రి అమరేందర్ రెడ్డి, జయప్రకాష్, కానుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: యువత, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్ గ్రౌండ్స్‌లో కె. రామస్వామి, లక్ష్మీదేవీ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పోటీలు యువత, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడుతాయన్నారు. యువత, విద్యార్థులను క్రీడలపరంగా ప్రోత్సహించాలని సూచించారు. తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా ఎదిగి తమ భవిష్యత్ నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దినేష్ ఆనంద్, విజయానంద్‌లతో పాటు మల్లేష్, భీమ్‌రావ్, త్రిభువన్ పాల్గొన్నారు.

రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఆస్తి పన్ను పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు


ఆస్తిపన్ను చెల్లింపుదారుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ సుభాష్‌రావు

సికింద్రాబాద్: ఆస్తిపన్ను చెల్లింపులో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 90 శాతం అపరాధ రుసుం రాయితీని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు కోరారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆస్తి పన్ను సమస్యల పరిష్కార మేళాను ఆయన ప్రారంభించారు. తమ అధికంగా ఆస్తిపన్ను మదింపు చేశారని సదరు పన్నును తగ్గించాలని నలుగురు చెల్లింపుదారులు వినతిపత్రాలు అందించారు. స్పందించిన డీసీ మరోసారి భవన తీరు తెన్నులను పరిశీలించి సవరణలు చేస్తామన్నారు. మార్చి నెలాఖరులోగా బకాయిలు చెల్లించని వినియోగదారులకు అపరాధ రుసుం రాయితీ వర్తించదన్నారు. ప్రతీ ఆదివారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగే పరిష్కార మేళాకు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎండీ ఉమర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బేగంపేట సర్కిల్ కార్యాలయంలో..

సనత్‌నగర్: ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికై బేగంపేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పరిష్కార వేదికను బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య ప్రారంభించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఈ పరిష్కార వేదికలో పాల్గొని గృహ యజమానులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఆస్తి పన్నుకు సంబంధించి మొత్తం 8 దరఖాస్తులు రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

‘వశిష్ట’లో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్


నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

సనత్‌నగర్: బీకేగూడ వశిష్ట విద్యాలయలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు పెద్ద ఆలోచనలతో వైజ్ఞానిక ఎగ్జిబిట్లు రూపొందించి ప్రదర్శించారు. సాంకేతికతలో వచ్చిన మార్పులను కళ్లముందు ఆవిష్కరించారు. ముఖ్యంగా చంద్రయాన్–3 ప్రయోగం, అంతకంతకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొనేందుకు పరిష్కార మార్గాలపై రూపొందించిన ప్రాజెక్టు, పర్యావరణం కాపాడుకోవడంపై ఆవశ్యకత..ఇలా సమాజహితానికి సంబంధించిన సందేశాత్మక ప్రాజెక్టులను తయారుచేసి వావ్ అనిపించారు. వైజ్ఞానిక ప్రదర్శనను చైర్మన్ ఎస్వీ.రమణబాబు, డైరెక్టర్ భార్గవ్ ప్రారంభించి మాట్లాడుతూ.. వైజ్ఞానిక రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, వాటిపై అవగాహన కల్పించడంతో పాటు విషయ పరిజ్ఞానం పెంపొందించే రీతిలో ఈ వైజ్ఞానిక ప్రదర్శన కొనసాగిందన్నారు. హెచ్‌ఓడీలు సౌజన్య, శ్రీదేవి పాల్గొన్నారు.





మానసిక ఒత్తిడిని దూరం చేయాలి


అవార్డులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ వాణీదేవి, వేణుగోపాలచారి

సికింద్రాబాద్: విద్యార్థులకు మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ విద్యా బోధనలు చేయాలని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు బీఎస్ ఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన మాథుర్ విద్యాలయ వార్షికోత్సవాల్లో ఆమెతో పాటు కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆశయాలు తెలుసుకుని ఆ దిశగా బోధనలు చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా సముద్రాల వేణుగోపాలచారి విద్యార్థులకు ఒలంపిక్ స్పోర్ట్స్ కిట్స్‌తో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులను మెరిట్ అవార్డులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సైక్లింగ్ స్టేడియం చీఫ్ ఏఎన్‌కే గోకుల్, గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రామారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి సంజీత్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ‘బాధ్యత’గా జీవించాలి


టీజర్ విడుదలలో నటీనటులు

పద్మారావునగర్: నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు నీతి, నిజాయితీతో పాటు బాధ్యతగా వ్యవహరిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. సీకేఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సినీ కొరియోగ్రాఫర్ సి. కుమార్ దర్శకత్వం, స్వీయ నిర్మాణంలో నిర్మించిన బాధ్యత సినిమా టీజర్‌ను పద్మారావునగర్ స్వరాజ్ ప్రెస్ ఆడిటోరియంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్‌క్రైమ్ పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ఏ సంస్థ కూడా ఓటీపీలు అడగవనిఈ విషయం ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలన్నారు. చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన బాధ్యత సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై రూపొందించిన ఆరు టీజర్లను ప్రదర్శించారు. ఎస్‌బీఐ మేనేజర్ కామేశ్వరి, నటీనటులు సుధాజైన్, విశ్వజ, కిరణ్, సాక్షి శ్రీనివాస్, మాటలు, పాటలు సమకూర్చిన రచయిత బోయిన భాస్కర్, మ్యూజిక్ డైరెక్టర్ విష్ణుకిశోర్ పాల్గొన్నారు.

వ్యాయామ టీచర్ల భర్తీకి ఆమరణ నిరాహారదీక్ష


పోలీస్ స్టేషన్‌లో విద్యార్థుల ఆమరణ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1600 వ్యాయామ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఓయూలో ఆమరణ దీక్ష చేపట్టారు. ఆదివారం స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పీఈటీ, పీడీ పోస్టులు 1600 ఉంటే 182 ఖాళీలను మాత్రమే చూపిస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా దీక్షలు కొనసాగించగా జక్కుల వెంకటేష్ స్పృహ కోల్పోయాడు.

బీదలబస్తీ కమిటీ అధ్యక్షుడిగా సీతారాం


సీతారాంను అభినందిస్తున్న బస్తీవాసులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ కమిటీ అధ్యక్షుడిగా ఆదివారం జరిగిన ఎన్నికల్లో నందారం సీతారాం గెలుపొందారు. బీదలబస్తీ ఆవిర్భావం నుంచి దశాబ్దాల కాలంగా బస్తీ కమిటీకి ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈసారి పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బస్తీ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. ఇదే బస్తీకి చెందిన నాయకులు నందారం సీతారాం, వీఆర్ ప్రసాద్‌రావు, కేఏ విద్యాసాగర్ పోటీ పడ్డారు. 346 మంది ఓటింగ్‌లో పాల్గొనగా సీతారామ్ 144, ప్రసాద్‌రావు 110, విద్యాసాగర్‌కు 80 ఓట్లు వచ్చాయి. 34 ఓట్ల మెజారిటీతో అధ్యక్షుడిగా గెలుపొందిన సీతారాం బస్తీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ విశ్వశాంతి యువజన సంఘం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతారని బస్తీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం మల్లేష్, రాజమౌళి, ఆంజనేయులు, సత్యనారాయణ, గోవింద్, శేషగిరిరావు, శ్రీధర్, శ్రీకాంత్, నరేందర్ పాల్గొన్నారు.